క్లుప్తంగా

చెక్‌పోస్టుల్లో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి



పొట్టిలంక చెక్‌పోస్టు వద్ద వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్పీ జగదీష్

కడియం: బోర్డర్ చెక్‌పోస్టుల వద్ద విధుల్లో ఉన్న సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ పి.జగదీష్ ఆదేశించారు. కడియం మండలం పొట్టిలంక వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడి సిబ్బంది పనితీరును స్వయంగా పరిశీలించారు. అలాగే పలు వాహనాలను ఎస్పీ తనిఖీ చేశారు. ఎస్పీ జగదీష్ మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా గంజాయి, సారా, అక్రమ మద్యం, నగదు, నిషేధిత వస్తువుల రవాణాను అరికట్టాల్సిన బాధ్యత పోలీసు యంత్రాంగంపై ఉందన్నారు. వాహన డ్రైవర్లు, యజమానులతో మర్యాద పూర్వకంగా మాట్లాడాలని, ప్రతిక్షణం అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎస్పీ వెంట ఇన్‌స్పెక్టర్ బి.తులసీదర్, సిబ్బంది ఉన్నారు.

అతిథి ఉపన్యాసం

కంబాలచెరువు: స్థానిక ప్రభుత్వ స్వయం ప్రతిపత్తి కళాశాల రసాయన శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో బుధవారం అతిథి ఉపన్యాసం నిర్వహించారు. విశ్రాంత ప్రధాన ఆచార్యులు ఎన్వీ రామకృష్ణ ముఖ్యఅతిథిగా విచ్చేసి, రసాయన తిరోగమన సంశ్లేషణ విధానంపై ప్రసంగించారు. వీరి ఉపన్యాసం అనేకమంది యువ శాస్త్రవేత్తలు తయారు కావడానికి సహకరిస్తుందని కళాశాల రసాయన శాస్త్ర విభాగాధిపతి టి.శ్రీనివాస్ అన్నారు. కార్యక్రమంలో రసాయనశాస్త్ర అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

రాజమహేంద్రవరం సిటీ: అత్యవసర పరిస్థితుల నేపథ్యంలో శుక్రవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ ఈఈ నక్కపల్లి శామ్యూల్ తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 11 గంటల వరకూ లాలాచెరువు ఏరియా, సుబ్బారావు పేట, నారాయణపురం, సైకిల్ కాలనీ, గాంధీపురం – 4, రెవెన్యూ కాలనీ, శిశు స్కూల్ సమీపంలోని వాంబే కాలనీ, పోస్టల్ కాలనీ, సాయిదుర్గానగర్ ఏరియాల్లో సరఫరా ఉండదు.

- ఉదయం 8 నుంచి 10 గంటల వరకూ మోరంపూడి జంక్షన్, గణేష్ నగర్, క్యూబటిక్ విల్లాస్, హనుమాన్ నగర్, శ్రీనగర్ కాలనీ, శుభమస్తు ఫంక్షన్ హాల్ తదితర ప్రాంతాల్లో అంతరాయం కలుగుతుంది. ఈ మేరకు వినియోగదారులు సహకరించాలని ఈఈ నక్కపల్లి శామ్యూల్ కోరారు.

డిమాండ్లు నెరవేర్చే వరకూ సమ్మె

ప్రకాశం నగర్: పేపర్ మిల్లు కార్మికుల న్యాయమైన డిమాండ్లు నెరవేర్చేవరకూ విధులను హాజరయ్యే ప్రసక్తే లేదని ఆంధ్రా పేపర్ మిల్లు 11 కార్మిక సంఘాలు తేల్చి చెప్పాయి. వేతన ఒప్పందం అమలు చేయాలని కోరుతూ కార్మికులు చేస్తున్న సమ్మె గురువారానికి మూడో రోజుకు చేరింది. కార్మికులు, యాజమాన్యంతో కార్మిక శాఖ అధికారి రాణి చర్చలు జరిపారు. సమస్యను పరిష్కారిస్తామని, కార్మికులు విధులకు హాజరు కావాలని సూచించారు. అయితే తమ డిమాండ్లు నెరవేర్చువరకూ సమ్మె కొనసాగిస్తామని కార్మికులు తెలిపారు.

90 శాతం పూర్తయిన పింఛన్ల పంపిణీ



దుళ్లలో పేషెంట్‌కు ఇంటి వద్ద పింఛన్ పంపిణీ చేస్తున్న సచివాలయం ఉద్యోగి

ప్రకాశం నగర్: నగరపాలక సంస్థ పరిధిలోని 95 సచివాలయాల్లో గురువారం సాయంత్రం నాటికి 90 శాతం పింఛన్ల పంపిణీ పూర్తయ్యిందని నగర పాలక సంస్థ కమిషనర్ కె.దినేష్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం సెలవు అయినప్పటికీ పింఛన్ల పంపిణీ జరుగుతుందన్నారు. మంచంపై ఉన్న, వీల్ చైర్లకు పరిమితమైన లబ్ధిదారులకు, సైనిక్ వెల్ఫేర్ పింఛన్ లబ్ధిదారులకు ఇంటి దగ్గరే అందజేస్తామన్నారు.

కడియం మండలంలో 85 శాతం..

కడియం: మండలంలో గురువారం రాత్రి ఎనిమిది గంటల సమయానికి 85.61 శాతం పెన్షన్ల పంపిణీ పూర్తయినట్లు ఎంపీడీవో జి.రాజ్ మనోజ్ తెలిపారు. మొత్తం 12,220 పింఛన్లకు గాను రూ.3,63,59,500 మంజూరయ్యాయన్నారు. వాటిలో 10,462 మంది లబ్ధిదారులకు రూ.3,14,91,000 పంపిణీ చేశామన్నారు. పింఛన్‌దారులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకున్నామన్నారు. వేమగిరిలో వృద్ధాశ్రమం వద్దకే వెళ్లి సచివాలయ సిబ్బంది పింఛన్లు పంపిణీ చేశారన్నారు. నడవలేని వారికి, తీవ్ర అనారోగ్యంతో మంచంపై ఉన్న వారికి ఇంటి వద్దే పెన్షన్లు అందించినట్టు ఆయన తెలిపారు.

ప్రజల కష్టాలు తెలిసిన నేత జగనన్న

- అన్ని వర్గాల సంక్షేమమే ఆయన లక్ష్యం
- ప్రజలకు ఏ సమస్య వచ్చినా నేను తోడుంటా
- 16వ డివిజన్ వాంబే గృహాల వద్ద మంత్రి వేణు ఎన్నికల ప్రచారం



16వ డివిజన్ వాంబే కాలనీలో ఎన్నికల ప్రచారం చేస్తున్న మంత్రి వేణు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): ప్రజల కష్టాలను తెలుసుకుని, వాటిని పరిష్కరించిన మనసున్న నాయకుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని రాష్ట్ర బీసీ సంక్షేమం, సమాచార పౌరసంబంధాల, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి, వైఎస్సార్ సీపీ రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ అన్నారు. స్థానిక 16వ డివిజన్ ఆవ వాంబే కాలనీలో ప్రముఖ న్యాయవాది, వైఎస్సార్ సీపీ నేత గొందేశి శ్రీనివాసులురెడ్డి, రాష్ట్ర శెట్టిబలిజ, గౌడ, ఈడిగ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పాలిక శ్రీను ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వేణు మాట్లాడుతూ రాష్ట్రంలో అన్ని వర్గాల సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలన సాగిస్తున్నారన్నారు. అమ్మ ఒడి, విద్యాదీవెన, వసతి దీవెన, విదేశీ విద్య వంటి పథకాలకు శ్రీకారం చుట్టి విద్యార్థులకు చేయూత అందిస్తున్నారన్నారు. ఇచ్చిన మాట ప్రకారం పెన్షన్లను పెంచారని, డ్వాక్రా అక్కచెల్లెమ్మల రుణాలను మాఫీ చేశారన్నారు. ఆరోగ్యశ్రీ కార్డు పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.25 లక్షల వరకూ పెంచారన్నారు. వాంబే కాలనీ వాసుల కోసం అర్బన్ హెల్త్ సెంటర్, ప్రధాన రోడ్లను రూ.కోట్లతో అభివృద్ధి చేశామన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికలలో ప్రతి ఒక్కరూ సీలింగ్ ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి తనను ఎమ్మెల్యేగా, డాక్టర్ గూడూరి శ్రీనివాస్‌ను ఎంపీగా గెలిపించాలని, జగన్‌ను మరోసారి ముఖ్యమంత్రి చేయాలని కోరారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ డివిజన్ల క్లస్టర్ అధ్యక్షుడు మింది నాగేంద్ర, జేసీఎస్ కన్వీనర్ కొప్పినీడి ప్రసాద్ బాబు (రాజమౌళి), పార్టీ నాయకులు చీకురుమిల్లి చిన్నా, మందపల్లి త్రిమూర్తులు, కాటూరి శ్యామ్, కరక ఉమ, కుందూరి దుర్గరావు, అనురాధ, ఈతలపాక రాజు, బుంగా యాకోబు, వల్లిపల్లి దుర్గాప్రసాద్, పోలవరపు బాబూరావు పాల్గొన్నారు.

సీఎం జగన్‌తోనే అన్ని వర్గాలకూ మేలు



వైఎస్సార్ సీపీలో చేరిన మహిళలతో న్యాయవాది గొందేశి శ్రీనివాసులురెడ్డి

- వైఎస్సార్ సీపీ నాయకుడు గొందేశి శ్రీనివాసులురెడ్డి
- పార్టీలో 200 మంది చేరిక

రాజమహేంద్రవరం రూరల్: సీఎం జగన్‌తోనే అన్ని వర్గాలకూ మేలు జరుగుతుందని ప్రముఖ న్యాయవాది, వైఎస్సార్ సీపీ నాయకుడు గొందేశి శ్రీనివాసులురెడ్డి అన్నారు. బాలాజీపేటలోని గొందేశి మెన్షన్‌లో గురువారం ఆయన సమక్షంలో మంత్రి వేణుకు మద్దతుగా బొమ్మూరు గ్రామానికి చెందిన మహిళా మండలి అధ్యక్షురాలు ఎస్‌కే సమీరా ఆధ్వర్యంలో టీడీపీ, జనసేన పార్టీల నుంచి ముస్లిం, ఇతర వర్గానికి చెందిన 200 మంది మహిళలు, అలాగే 16వ డివిజన్‌కు చెందిన టీడీపీ నేతలు బట్ల వెంకటరావు, బిట్ర సత్తిబాబు, శరకణం సూరిబాబు వైఎస్సార్ సీపీలో చేరారు. వీరికి గొందేశి శ్రీనివాసులురెడ్డి, మండల జేసీఎస్ కన్వీనర్ తాటికొండ విష్ణుమూర్తి, వైఎస్సార్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు ముద్దాల అను తదితరులు పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. గొందేశి శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేసుకోవాలన్నారు. అలాగే ఫ్యాన్ గుర్తుపై ఓట్లు వేసి రూరల్ ఎమ్మెల్యేగా మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, ఎంపీగా డాక్టర్ గూడూరి శ్రీనివాస్‌ను గెలిపించాలన్నారు. కార్యక్రమంలో పార్టీ సాంస్కృతిక విభాగం రీజినల్ కో ఆర్డినేటర్ నాగులపల్లి ఆశ, రెడ్డి ప్రసాద్, సీతారాం, చరణ్, కేత గిరి, అరుణ, బేబీ రాణి తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్ల రాజీనామా

రాజమహేంద్రవరం రూరల్: పిడింగొయ్యి గ్రామ సచివాలయాల పరిధిలోని ఐదుగురు వలంటీర్లు గురువారం ఎంపీడీవో డి.శ్రీనివాసరావుకు రాజీనామా పత్రాలను అందజేశారు. సచివాలయం–2 నుంచి ఎం.ఆశాజ్యోతి, 3 నుంచి పి.ధనదుర్గ, పి.గోపిచంద్రకళ, మారె సుధారాణి, 4 నుంచి ఎల్వీ ప్రసాద్ రాజీనామాలు చేశారు. ప్రతిపక్ష పార్టీలు వలంటీర్లపై అసత్య ప్రచారాలు చేస్తున్న నేపథ్యంలో మనస్తాపంతో రాజీనామా చేసినట్టు వారు తెలిపారు.

వలంటీర్లకు ప్రత్యామ్నాయం ఏర్పాటు చేయాలి

రాజమహేంద్రవరం రూరల్: వలంటీర్లకు ప్రత్యామ్నాయ వ్యవస్థను ఏర్పాటు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని తెలుగుదేశం పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, టీడీపీ,జనసేన,బీజేపీ ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి గోరంట్ల బుచ్చయ్య చౌదరి అన్నారు. ఆయన గురువారం తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ సచివాలయాలకు నగదు డిపాజిట్ కాలేదని, డబ్బులు డిపాజిట్ చేస్తే అర గంటలో పింఛన్లు పంపిణీ చేయవచ్చన్నారు. కాపు ఉద్యమం చేసి ముద్రగడ పద్మనాభం ఏం సాధించారో చెప్పాలని డిమాండ్ చేశారు. అనపర్తి సీటు విషయంలో రెండు, మూడు రోజుల్లో సానుకూల నిర్ణయం వెలువడుతుందన్నారు.

మృతి చెందిన పింఛన్‌దారులకు నివాళి



కొవ్వొత్తులు వెలిగించి నివాళులర్పిస్తున్న మహిళలు

ప్రకాశం నగర్: పింఛన్ తీసుకునే సమయంలో ఇబ్బందులకు గురై మృతి చెందిన నెల్లూరు, తిరుపతి, కృష్ణా జిల్లాల లబ్ధిదారులకు గురువారం రాత్రి స్థానిక 49వ డివిజన్‌లో వైఎస్సార్ సీపీ నాయకుడు బర్రే కొండబాబు ఆధ్వర్యంలో మహిళలు కొవ్వొత్తులు వెలిగించి నివాళులర్పించారు. కొండబాబు మాట్లాడుతూ పింఛన్లను యథాతథంగా వలంటీర్లతో పంపిణీ చేయించాలని కోరారు. కార్యక్రమంలో బర్రే మరియ, గారా నూకరత్నం, బలగం రాజవేణి, సంధ్య, మానెమ్మ, గారా నాగమణి, గారా రాజు, 49వ వార్డు పరిశీలకుడు ఉదయరాణా పాల్గొన్నారు.

పుస్తకావిష్కరణ

రాజానగరం: ది ఫిలాసఫీ ఆఫ్ అడ్జస్ట్‌మెంట్, యాంగ్జయిటీ అండ్ అకడమిక్ అచీవ్‌మెంట్ పుస్తకాన్ని ఆదికవి నన్నయ యూనివర్సిటీ వీసీ ఆచార్య కె.సుబ్బారావు గురువారం ఆవిష్కరించారు. క్యాంపస్‌లోని బీఈడీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సుబ్బారావు, డాక్టర్ కొయ్యలమూడి రాధ ఈ పుస్తకాన్ని రచయించగా, న్యూఢిల్లీలోని బుక్ రివర్స్ ముద్రించింది. ఈ సందర్భంగా పుస్తక రచయితలను వీసీ ఆచార్య పద్మరాజు, రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్ అభినందించారు.

వైభవంగా వేంకటేశ్వరస్వామి ఊరేగింపు



పల్లకీలో ఊరేగుతున్న స్వామివారు

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరులోని శ్రీభూసమేత వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో 12వ వార్షికోత్సవం సందర్భంగా గురువారం మధ్యాహ్నం స్వామివారి పల్లకీ ఊరేగింపు అత్యంత వైభవంగా జరిగింది. ప్రముఖ న్యాయవాది గొందేశి శ్రీనివాసులురెడ్డి పర్యవేక్షణలో ఆలయ అర్చకుడు అంగర వల్లీకాంతాచార్యులు, ఉత్సవ కమిటీ సభ్యులు, భక్తుల నడుమ, కోలాట నృత్యాలతో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఆలయం నుంచి వేంకటేశ్వర నగర్, బాలాజీ పేట, రామకృష్ణ నగర్, నవ భారతి నగర్ తదితర వీధులలో తిరిగి మళ్లీ ఆలయానికి చేరుకుంది.

నేడు కల్యాణోత్సవం

స్వామివారి వార్షిక కల్యాణోత్సవం సందర్భంగా శుక్రవారం ఉదయం విశేషపూర్ణాభిషేకం, హోమాది కార్యక్రమాలు, మధ్యాహ్నం అన్నసమారాధన, సాయంత్రం 5 గంటలకు కల్యాణోత్సవం జరుగుతుందని ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు.

ఘనంగా శ్రీరాజలింగేశ్వరస్వామి కల్యాణోత్సవం



కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

రాజానగరం: స్థానిక శ్రీరాజలింగేశ్వరస్వామి, శ్రీరాజగోపాలస్వామి ఆలయ సముదాయంలో దేవతా మూర్తుల కల్యాణోత్సవం గురువారం రాత్రి కన్నుల పండుగగా జరిగింది. పాల్గుణ బహుళ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని ఈ ఆలయాలలో కొలువైవున్న రాజరాజేశ్వరీ సమేత రాజలింగేశ్వరస్వామి, రుక్మిణీ, సత్యభామ సమేత రాజగోపాలస్వామి వార్లకు శాస్త్రోక్తంగా, సంప్రదాయబద్ధంగా కల్యాణోత్సవం నిర్వహించారు. స్థానిక ప్రముఖులు దూలం శ్రీవెంకట సూర్యనారాయణ (పెద్ద), దుర్గాపు వసంతరావు దంపతుల ఆధ్వర్యంలో ఆలయ అర్చకుల పర్యవేక్షణలో వైభవంగా నిర్వహించిన ఈ కల్యాణోత్సవాన్ని తిలకించేందుకు అనేక మంది భక్తులు తరలివచ్చారు.

ప్రజల సేవకు నలుగురం సిద్ధం

- వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించండి
- ఎమ్మెల్యే రాజా సతీమణి డాక్టర్ రాజశ్రీ



సీతానగరం పంచాయతీ లంకూరులో ఎన్నికల ప్రచారం చేస్తున్న డాక్టర్ జక్కంపూడి రాజశ్రీ

సీతానగరం: ప్రజలకు సేవలు అందించడానికి జక్కంపూడి కుటుంబం నుంచి నలుగురం ఎప్పుడు అందుబాటులో ఉంటామని, రాబోయే ఎన్నికల్లో సీలింగ్ ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించాలని ఎమ్మెల్యే జక్కంపూడి రాజా సతీమణి డాక్టర్ జక్కంపూడి రాజశ్రీ అన్నారు. సీతానగరం పంచాయతీ పరిధిలోని లంకూరులో గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్యేగా తన భర్త జక్కంపూడి రాజాను, ఎంపీగా డాక్టర్ శ్రీనివాస్‌ను గెలిపించాలని కోరారు. సీలింగ్ ఫ్యాన్ గుర్తుపై ఓటు వేయాలని మహిళలకు బొట్టు పెట్టి అభ్యర్థించారు. డాక్టర్ జక్కంపూడి రాజశ్రీ మాట్లాడుతూ మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలే కాకుండా, ఇవ్వని హామీలను సైతం అమలు చేసి ప్రజలకు మేలు చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి దక్కిందన్నారు. రాజానగరం నియోజకవర్గం అభివృద్ధిలో పరుగులు పెడుతోందన్నారు. కోవిడ్ సమయంలో ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, జక్కంపూడి విజయలక్ష్మి, జక్కంపూడి గణేష్‌లు ప్రజలకు అందుబాటులో ఉంటూ ఎన్నో సేవలు అందించారని గుర్తు చేశారు. సీతానగరం మండల ప్రజల చిరకాల కోరికైన కాతేరు – సీతానగరం రోడ్డును రూ.104 కోట్లతో నిర్మిస్తున్నామని, ఇప్పటికే పనులు చాలా వరకూ పూర్తయ్యాయన్నారు. రైతులతో పాటు ప్రజలకూ నాణ్యమైన విద్యుత్ అందించాలనే లక్ష్యంతో సీతానగరం మండలం కాటవరంలో రూ 2.78 కోట్లు, చినకొండేపూడిలో రూ.2.26 కోట్లతో విద్యుత్ సబ్ స్టేషన్లను అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. గడచిన 40 ఏళ్లుగా జక్కంపూడి కుటుంబం ప్రజాసేవకు అంకితమైందన్నారు. సంక్షేమ ప్రభుత్వాన్ని తిరిగి గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ ఘంటా శ్రీనివాస్, జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు పెదపాటి డాక్టర్ బాబు, మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు కోండ్రపు ముత్యాలు, మండల ఆర్బీకే చైర్మన్ వలవల వెంకట్రాజు (తోటలో రాజు), మండల యూత్ అధ్యక్షుడు కోల శ్రీను, పీఏసీఎస్ చైర్‌పర్సన్ మట్ట వసంతరావు, ఉపసర్పంచ్ ద్వారంపూడి రామకృష్ణ, మట్ట శ్రీను, కాండ్రు వీరన్న, మట్ట పోశియ్య, తోరం బ్రహ్మాజీ, తోరం పోశియ్య, ఈత వీరబాబు, బాబు నాగేశ్వరరావు, వలవల వల్లీ, మట్ట మునియ్య పాల్గొన్నారు.

అభివృద్ధిని విస్మరించిన టీడీపీ



నగరంలో ఎన్నికల ప్రచారం చేస్తున్న ఎంపీ భరత్‌రామ్

- పింఛన్‌దారులపై చంద్రబాబు కక్ష
- ఎంపీ, వైఎస్సార్ సీపీ సిటీ ఎమ్మెల్యే అభ్యర్థి భరత్‌రామ్

రాజమహేంద్రవరం సిటీ: నగరంలో 16 ఏళ్లుగా అధికారంలో ఉన్న తెలుగుదేశం పార్టీ నాయకులు అభివృద్ధిని విస్మరించారని ఎంపీ, వైఎస్సార్ సీపీ సిటీ ఎమ్మెల్యే అభ్యర్థి మార్గాని భరత్ రామ్ ధ్వజమెత్తారు. ఆయన గురువారం 36వ డివిజన్ ఆదెమ్మదిబ్బ ప్రాంతంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలుసుకున్నారు. సీఎం జగన్ సంక్షేమ పాలనను, ఎంపీగా తాను నగరంలో చేసిన అభివృద్ధిని వివరించారు. రాబోయే ఎన్నికలలో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి ఎమ్మెల్యేగా తనను గెలిపించాలని కోరారు.

చంద్రబాబు కక్షసాధింపు

ఎంపీ భరత్‌రామ్ మాట్లాడుతూ ఎన్నికల సంఘానికి చంద్రబాబు నాయుడు ఫిర్యాదు చేయడం వల్లే పింఛన్ల పంపిణీ నుంచి వలంటీర్లను తొలగించారన్నారు. అవ్వాతాతలు, దివ్యాంగులు, ఇతర పింఛన్ దారులపై చంద్రబాబు ఈ విధంగా కక్ష తీర్చుకుంటున్నారన్నారు. గత టీడీపీ పాలనలో గంటల తరబడి క్యూలో నిలబడి పింఛన్ తీసుకునేవారని, జగన్ ప్రభుత్వంలో వలంటీర్లు ఇంటికి వచ్చి పింఛన్లు అందజేశారన్నారు. మరో రెండు నెలలు ఈ కష్టాలు తప్పవని, ఎన్నికలయ్యాక మళ్లీ రాష్ట్రంలో వచ్చేది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే అన్నారు. సీఎంగా జగనన్న అధికారంలోకి రాగానే వలంటీర్లు మీ ఇళ్లకు పెన్షన్ అందజేస్తారన్నారు. ఆదిరెడ్డి కుటుంబం 16 ఏళ్లు పదవులు అనుభవించారే కానీ, ఒక్క అభివృద్ధి పని కూడా చేయలేదన్నారు. టీడీపీకి వచ్చే ఎన్నికలలో ప్రజలందరూ తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. ఆయన వెంట రుడా చైర్మన్ రౌతు సూర్యప్రకాశరావు, నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి పాల్గొన్నారు.

గణపతి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం

స్థానిక 24వ డివిజన్ కేవీఆర్ స్వామి రోడ్డులోని శివ గణేష్ మందిరంలో విగ్రహ పునఃప్రతిష్ఠా మహోత్సవం ఘనంగా జరిగింది. ముఖ్య అతిథిగా ఎంపీ భరత్‌రామ్ హాజరయ్యారు. కార్యక్రమంలో భాగంగా ప్రత్యేక యాగాలు, విశేష అర్చనలు నిర్వహించారు.

జవాబుదారీతనంతో ఎన్నికల విధులు



శిక్షణలో మాట్లాడుతున్న జేసీ తేజ్ భరత్



మాట్లాడుతున్న కమిషనర్ దినేష్ కుమార్

రాజమహేంద్రవరం రూరల్: పారదర్శకత, జవాబుదారీతనంతో ఎన్నికల సిబ్బంది విధులు నిర్వహించాలని రూరల్ అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.తేజ్ భరత్ అన్నారు. స్థానిక కలెక్టరేట్ సమావేశ మందిరంలో గురువారం సాయంత్రం మాస్టర్ ట్రైనర్లు, బీఎల్‌వోలు, ఇతర ఎన్నికల సిబ్బందికి శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. జేసీ మాట్లాడుతూ సెక్టార్ అధికారులు, అసెంబ్లీ స్థాయి మాస్టర్ ట్రైనర్లు ఈ శిక్షణ తరగతులను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలన్నారు. పోలింగ్ రోజు పీవోలు, ఏపీవోల పాత్ర, వారు అనుసరించాల్సిన ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను వివరించారు. కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్ సాయిబాబా, రూరల్, కడియం తహసీల్దార్లు అప్పారావు, రమాదేవి పాల్గొన్నారు.

అన్ని అంశాలపై అవగాహన

రాజమహేంద్రవరం సిటీ: మాస్టర్ ట్రైనీలు తమకు కేటాయించిన అంశాలపై అవగాహన పెంచుకుని, పోలింగ్ సిబ్బందికి పూర్తి స్థాయిలో శిక్షణ ఇవ్వాలని రిటర్నింగ్ అధికారి, కమిషనర్ కె.దినేష్ కుమార్ అన్నారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో గురువారం సిటీ అసెంబ్లీ నియోజకవర్గ మాస్టర్ ట్రైనీలతో సమావేశం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ ప్రిసైడింగ్ ఆఫీసర్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ ఆఫీసర్లకు మాక్ పోల్ నిర్వహించే విధానం, ఈవీఎంలు సిద్ధం చేసుకోవడం, ఎన్నికల నిర్వహణ రిపోర్టు ఫారాలు నింపడం తదితర వాటిపై శిక్షణ ఇవ్వాలి. సమావేశంలో అర్బన్ తహసీల్దార్ కె.ఆంజనేయులు పాల్గొన్నారు.

శంకుస్థాపన చేసిన నెల రోజుల్లో రోడ్డు పూర్తి

- మంత్రి వేణు చొరవతో సమస్యకు మోక్షం
- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు




టిడ్కో గృహాల సముదాయానికి వెళ్లే రోడ్డు

రాజమహేంద్రవరం రూరల్: ధవళేశ్వరం గ్రామ పంచాయతీ పరిధిలోని కలెక్టరేట్ సమీపంలో ఉన్న టిడ్కో గృహాల సముదాయానికి వెళ్లే రహదారి అధ్వానంగా ఉండేది. దానిపై రాకపోకలకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడేవారు. ఈ విషయం తెలుసుకున్న మంత్రి, వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వేణుగోపాలకృష్ణ నగరపాలకసంస్థ నిధులతో రూ.40 లక్షలతో గత నెల ఐదో తేదీన సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. నెల రోజులు తిరగక్కుండానే ఆ సీసీ రోడ్డు నిర్మాణం పూర్తయ్యింది. టిడ్కో గృహ సముదాయ వాసులు ఆనందంగా ఆ రోడ్డులో రాకపోకలు సాగిస్తున్నారు. టిడ్కో వాసులతో పాటు రాజవోలు, బొమ్మూరు నుంచి ధవళేశ్వరం వెళ్లే ప్రజలకు సైతం ఎంతగానో ఉపయోగపడుతుంది. దీంతో మంత్రి వేణుగోపాలకృష్ణకు టిడ్కోగృహ సముదాయం వాసుల తరఫున అసోసియేషన్ నాయకులు నారాయణరావు, ముత్యాలు కృతజ్ఞతలు తెలిపారు.

సీనియర్ సివిల్ జడ్జిల బదిలీ

కాకినాడ లీగల్: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో పలువురు సీనియర్ సివిల్ జడ్జిలలను బదిలీ చేస్తూ హైకోర్టు గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. వివరాల్లోకి వెళ్తే.. రాజమహేంద్రవరం న్యాయ సేవధికార సంస్థ కార్యదర్శి కె.ప్రత్యూషకుమారిని కడప సీనియర్ సివిల్ జడ్జిగా నియమించారు. ఆమె స్థానంలో తాడేపల్లిగూడెం సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రకాష్‌బాబును నియమించారు. అలాగే రాజమహేంద్రవరం ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి ఎస్.ప్రవీణ్‌కుమార్‌ను కడప ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జిగా నియమించారు. ఆయన స్థానంలో శ్రీకుకాళం సీనియర్ సివిల్ జడ్జి ఎం.అనురాధను నియమించారు.

6 వేల లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం



బెల్లపు ఊటను పరిశీలిస్తున్న సీఐ వినయ్‌మోహన్, పోలీసులు

ధవళేశ్వరం: సారా తయారీకి సిద్ధం చేసిన 6 వేల లీటర్ల బెల్లపు ఊటను ధవళేశ్వరం పోలీసులు ధ్వంసం చేశారు. గ్రామ శివారున ఉన్న పిచ్చుకలంకలో సారా తయారు చేస్తున్నారన్న సమాచారంతో ధవళేశ్వరం సీఐ జీవీ వినయ్ మోహన్ ఆధ్వర్యంలో పోలీసులు దాడి చేశారు. అక్కడ బెల్లపు ఊటను గుర్తించి ధ్వంసం చేశారు. ఎస్సై క్రాంతి కుమార్, హరిబాబు, ఎస్‌బీ అధికారులు పాల్గొన్నారు.

సినిమాలు

శ్యామల	ది ఫ్యామిలీ స్టార్
సూర్యమినీ	క్రూ
సూర్యప్యాలెస్	గాడ్జిల్లా అండ్ కాంగ్
స్వామి	ది ఫ్యామిలీ స్టార్
శివజ్యోతి	ది ఫ్యామిలీ స్టార్
అనుశ్రీ	గాడ్జిల్లా అండ్ కాంగ్
రాజా	ది ఫ్యామిలీ స్టార్
ఊర్వశి	ఓంభీమ్‌బుష్
రంభ	గాడ్జిల్లా అండ్ కాంగ్
మేనక	భరతనాట్యం
అప్సర	టిల్లు స్క్వేర్
కుమారి	టిల్లు స్క్వేర్
నామవరం	
వీఎస్ మహల్	ది ఫ్యామిలీ స్టార్
ధవళేశ్వరం	
మురళీకృష్ణ	ది ఫ్యామిలీ స్టార్
కడియం	
వెంకటసూర్య	ది ఫ్యామిలీ స్టార్